సాక్షి విశాఖపట్నం

గురువారం । 15 । ఆగస్టు । 2024

వైశాఖీ తీరం.. త్రివర్ణ శోభితం


కలెక్టరేట్


రైల్వేస్టేషన్


ఆర్.కె.బీచ్



మురళీనగర్‌కు చెందిన ఈ భార్యాభర్తల పేర్లు సావిత్రి, నాగేశ్వరరావు. అతను గుండె సంబంధిత వ్యాధితో వైద్యం కోసం కేజీహెచ్‌లోని కార్డియాలజీ విభాగంలో చేరారు. న్యూరాలజీకి సంబంధించిన పరీక్ష కోసం కార్డియాలజీ విభాగం నుంచి దాదాపు 200 మీటర్ల దూరం వెళ్లాలని వైద్యులు ఆయనకు సూచించారు. నడవలేని స్థితిలో ఉన్న తన భర్తను అతి కష్టం మీద నడిపిస్తూ తీసుకెళ్లారామె.



మరి అంత పే...ద్ద కేజీహెచ్‌లో వీల్ చెయిర్ కూడా లేదా అనే సందేహం రాక మానదు. ఇదిగో.. వీల్ చెయిర్‌ను హాస్పిటల్ సిబ్బంది తమకు కష్టం కలగకుండా ఇలా వాడేసుకుం టున్నారు.



ఈ చిత్రం చూశారా? ఆస్పత్రిలో ఫోన్లతో ఏం చేస్తున్నారని అనుకోవద్దు. కేజీహెచ్‌లో ఓపీ నమోదు చేసుకోవాలంటే.. ఫోన్లతో కుస్తీ పట్టాల్సిందే. ఓపీ నమోదు కోసం పెట్టిన యాప్‌లో వివరాలు నమోదు చేయాలంటే ఒక ప్రహసనమే..



ఎండలోనే చిన్నారులు.. అయ్యయ్యో.. అని బాధప డాల్సిందే. ఎందుకంటే ఓపీ దగ్గర అరకొరగానే వసతులు ఉన్నాయి. వంద మంది ఎక్కువగా వస్తే చాలు.. ఓపీ విభాగంలో కుస్తీ పట్లు పట్టాల్సిందే.. సేద తీరేందుకు చెట్టో పుట్టో చూసుకోవాల్సిందే.

కష్టాలు.. కన్నీళ్లు

కేజీహెచ్‌లో చూడవు ఏ కళ్లు

ఇలా ఒక చోట కాదు.. కేజీహెచ్‌లో అడుగు పెట్టిన ప్రతిచోటా.. ఏదో ఒక దయనీయ దృశ్యం దర్శనమిస్తుంటుంది. అవుట్ పేషెంట్ల 'యాప్'సోపాలు.. సిబ్బంది నిర్లక్ష్యం, సమయానికి అందని వైద్య సేవలు.. ఆరోగ్య పరీక్షలకు ఎదురుచూపులు.. చాలీచాలని బెడ్లు.. దొరకని మందులు.. ఇవీ సోమవారం 'సాక్షి' పరిశీలనలో కేజీహెచ్‌లో రాజ్యమేలుతూ పలకరించిన సమస్యలు. వైద్యం కోసం వచ్చే రోగులు.. తిరిగి ఇంటికి చేరుకునేంత వరకూ కష్టాలు, చీదరింపులు, ఉరుకులు పరుగులతో ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిలో సాహసం చేయాల్సిందే..

- లోపల అడుగు పెట్టినప్పటి నుంచి రోగులకు నరకమే..
- అవుట్ పేషెంట్ విభాగంలో 'యాప్'సోపాలు
- నెల రోజులుగా వేధిస్తున్న మందుల కొరత
- రక్త పరీక్షల రిపోర్టులకూ ఎదురుచూపులే..

'సాక్షి' పరిశీలనలో వెల్లడి



సాక్షి, విశాఖపట్నం/మహారాణిపేట/ఆరిలోవ/బీచ్‌రోడ్డు: కేజీహెచ్‌కు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలు, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి ప్రతి రోజూ వేలాది మంది రోగులు వస్తుంటారు. అయితే ఇక్కడ నాణ్యమైన వైద్య సేవలందడంలో ఇప్పటికీ అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆస్పత్రిలో 30కి పైగా విభాగాలుండగా అన్ని విభాగాలకు సుస్తీ పట్టుకుంటుంది. కొన్ని చోట్ల రోగులు కుక్కలతో సావాసం చేయాల్సిన దుస్థితి దాపురించింది. 'సాక్షి' పరిశీలనలో ఏయే విభాగాల వద్ద ఎటువంటి పరిస్థితి ఉందో ఓసారి చూద్దాం.

వార్డు బాయ్స్ ఉన్నట్లా.. లేనట్లా..?

క్యాజువాలిటీ విభాగానికి అత్యవసర కేసులు వచ్చాయి. ఆ సమయంలో కొన్ని విభాగాల్లో వార్డు బాయ్స్ కనిపించలేదు. క్యాజువాలిటీలో ఉన్న కొందరు వార్డ్ బాయ్స్, నర్సులు సరిగా స్పందించకపోవడంతో.. రోగుల బంధువులే అంబులెన్స్ నుంచి తీసుకెళ్లిన పరిస్థితులు కనిపించాయి. ఆక్సిజన్ సిలిండర్లు సైతం వారే మోసుకొని వెళ్తున్న దుస్థితి ఉంది.

ఓపి..క నశిస్తోంది

ఉదయం 10 గంటలు ఓపీ విభాగంలో జన జాతరే కనిపించింది. ఇదిగో ఇక్కడ కనిపిస్తున్న ఈ మహిళ తన బిడ్డకి బాగోలేకపోతే కేజీహెచ్‌కు వచ్చింది. ఓపీలో ఉన్న మాన్యువల్ లైన్‌లో ఉదయం 9 గంటలకు వచ్చి అరగంటకు పైగా నిలబడింది. కొంచెం కూడా లైన్ ముందుకు వెళ్లకపోవడంతో బయటకు వచ్చి యాప్‌లో ఓపీ తీసుకోవచ్చని అనుకుంది. ఫోన్ ఓపెన్ చేసి యాప్ డౌన్‌లోడ్ చేసుకుంది. వివరాలు నమోదుకు అవస్థలు పడింది. చివరకు సిబ్బందిని బతిమాలి వారి సహాయం తీసుకుంది. ఓపీ విభాగం ప్రతి రోగికీ, వారి బంధువుకీ బీపీ తెప్పిస్తోంది.




ఓపీ కౌంటర్ వద్ద క్యూలో రోగులు, వారి సహాయకులు..
ఆన్‌లైన్ ద్వారా 2,063 మంది, మాన్యువల్‌గా 500 మంది.. మొత్తం 2,563 మంది ఓపీ నమోదైంది.

- ఉదయం 10.15 గంటల నుంచి వైద్యులు విభాగాల వద్ద రోగులను పరీక్షించారు.
- మధ్యాహ్నం 12 గంటల వరకు ఓపీ చూశారు. అప్పటికే ప్రతీ విభాగం వద్ద 20 నుంచి 30 మంది వరకు రోగులు మిగిలిపోయారు.
- 2డీ ఎకో కేంద్రాన్ని మధ్యాహ్నం 12 గంటలకే మూసేశారు. ఆ తర్వాత పరీక్ష చేయించుకోవడానికి వచ్చిన రోగులను మరుసటి రోజు రావాలని చెప్పి.. పంపించేశారు.
- గైనిక్ విభాగంలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో కొందరు బాలింతలు చంటి పిల్లలను ఒడిలో పెట్టుకుని నేలపైనే కూర్చొన్నారు.
- కార్డియాలజీ విభాగం వద్ద ఓ మహిళా రోగిని వైద్య పరీక్షల కోసం ఆమె కుటుంబ సభ్యులే వీల్‌చైర్‌పై తీసుకెళ్లారు.
- భావనగర్ వార్డు వద్ద రోగుల సహాయకుల షెడ్‌లో ఫ్యాన్లు పని చేయడం లేదు.
- పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా కనిపించింది. గత ప్రభుత్వం నీటి శుద్ధి యంత్రాలను ఏర్పాటు చేసింది. వీటి నిర్వహణ గాలికొదిలేయడంతో రోగులు బయట నుంచి నీరు తీసుకురావడం కనిపించింది.



తిరగని ఫ్యాన్.. పని చేయని నీటిశుద్ధి మెషీన్

'యాప్'సోపాలు

ఓపీ కోసం ప్రత్యేకంగా అభా(ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) యాప్ రూపొందించారు. అయితే యాప్ సరిగా పనిచేయకపోవడంతో రోగులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచి పడిగాపులు కాస్తున్నా.. యాప్ ఓపెన్ కాకపోవడంతో మాన్యువల్ విభాగంలో క్యూలో నిలబడి ఓపీ రాయించుకున్నారు. మొత్తం 8 కౌంటర్లున్నా సరిపోవడం లేదు. ఇందులో మూడు కౌంటర్లు మహిళలు, చిన్న పిల్లల కోసం కేటాయించారు.



మందులెక్కడ మహాప్రభో?

మందులిచ్చే విభాగంలో 600 రకాల వరకు మందులు ఉండాల్సి ఉండగా.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 595 రకాల మందులుండేవి. ప్రస్తుతం 508 రకాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. క్యాజువాలిటీ విభాగం దగ్గర 3, పరీక్షల కేంద్రం ఎదురుగా 4 .. మొత్తం 7 మందుల కౌంటర్లున్నాయి. ఉదయం 9 గంటలకు ఈ కౌంటర్లు తీశారు. వచ్చే రోగులకు ఈ కౌంటర్లు సరిపోకపోవడంతో మందులు తీసుకునేందుకు అవస్థలు పడుతున్నారు. వైద్యులు ఆరు రకాల మందులు రాసిస్తే.. కేవలం మూడు రకాల మందులు మాత్రమే దొరుకుతున్నాయి. మిగిలినవి బయట కొనుక్కోవాలని సిబ్బంది చెబుతున్నారు.

ఇదేం యాప్ అండీ..?



మా అత్తకు అనారోగ్య సమస్య ఉండటంతో ఊర్వశి జంక్షన్ నుంచి వచ్చాను. యాప్‌లో ఓపీ నమోదు చేసుకోమని చెప్పారు. గంటన్నర నుంచి ట్రై చేస్తున్నా. ఇదేం యాప్.. ఎంత సేపు ట్రై చేసినా అవ్వడం లేదు. సిబ్బందిని అడిగితే సర్వర్ డౌన్ ఉంది.. ట్రై చేయండని చెబుతున్నారు. ఆధార్ కార్డు ద్వారా ఓపీ తీసుకుందామంటే పెద్ద లైన్ ఉంది.

– ప్రవీణ, ఊర్వశి జంక్షన్

ఇక్కడే పుట్టాడు.. అయినా ఓపీ అంటున్నారు



మా అమ్మాయికి బాబు పుట్టాడు. కేజీహెచ్‌లోనే 17 రోజుల కిందట డెలివరీ అయింది. బాబుకు పచ్చకామెర్లు వచ్చి తగ్గాయి. ఈ రోజు రమ్మని చెప్పారు. పాత రిపోర్టులున్నాయని చెబుతున్నా.. ఓపీ తీసుకోకపోతే డాక్టర్ దగ్గరికి పంపించమంటున్నారు. చంటిపిల్లాడిని పట్టుకుని ఎండలోనే అటు ఇటు తిరుగుతున్నాం.

– నాగమణి, రౌతులపాలెం

కేజీహెచ్ గైనిక్ వార్డులో నేలపైనే...



వైద్యుల కోసం గంటలే..

ఎలాగోలా కష్టపడి ఓపీ తీసుకుని.. తమకు అవసరమైన విభాగానికి వెళ్లి వైద్యుడి సలహాలు తీసుకోవాలని ప్రయత్నించిన ప్రతి రోగికీ సుమారు గంటకు పైగా సమయం పట్టింది. క్యాజువాలిటీ, కార్డియాలజీ, ఆర్థోపెడిక్, న్యూరాలజీ, ప్రసూతి, చిన్నపిల్లల వార్డు, క్రిటికల్ కేర్ విభాగం.. ఇలా ప్రతి చోటా వందల మంది రోగులు లైన్లలో కనిపించారు. రోగుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో.. డాక్టర్ చెకప్ కోసం గంటకు పైగా వేచి ఉండాల్సిన పరిస్థితి కనిపించింది.



వ్యాధి తేల్చరు... వేదన తీర్చరు!

కేజీహెచ్‌లో నిర్లక్ష్యపు విభాగం ఏదైనా ఉందంటే.. అందరికీ గుర్తొచ్చేది రక్త పరీక్షల కేంద్రమే. ఇక్కడ సిబ్బంది ఏ రోజూ సమయపాలన పాటించరు. రోగులు, వారి బంధువులు వచ్చి.. లైన్లలో గంటకు పైగా నిలబడితే.. రిపోర్టులకు రక్తం ఇచ్చేందుకు అనుమతి ఇస్తారు. పోనీ రిపోర్టులైనా త్వరగా ఇస్తారా అంటే.. అది దైవాధీనమే. అనకాపల్లికి చెందిన అప్పారావు అనే కిడ్నీ రోగిని పలకరించగా.. గత శుక్రవారం ఉదయం రక్త పరీక్షల కోసం రక్తం ఇవ్వగా.. సోమవారం రిపోర్టులు ఇచ్చారని చెప్పారు. కొన్ని రిపోర్టుల కోసం వారం రోజులకు పైగా ఎదురు చూడాల్సిన పరిస్థితుల కనిపిస్తున్నాయి. రక్త పరీక్షల నాణ్యత ప్రమాణాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కొన్ని పరీక్షల కోసం కేజీహెచ్ ఎదురుగా ఉన్న ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. ఆయా ల్యాబ్‌లకు చెందిన సిబ్బంది కేజీహెచ్‌లో కనిపిస్తున్నారు. ఇక్కడైతే వారం రోజులు పడుతుంది. ఫలానా ల్యాబ్‌కు వెళ్తే.. సాయంత్రానికల్లా రిపోర్టులు వచ్చేస్తాయంటూ సిబ్బందే రిఫర్ చేస్తున్నారు.

సమయపాలన లేదెందుకో..?

కేజీహెచ్ పరిధిలోని 26 విభాగాల్లో 72 మంది ప్రొఫెసర్లు, 66 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 237 మంది వైద్యులు, పారామెడికల్ సిబ్బందితో కలిపి మొత్తంగా 616 మంది స్టాఫ్ ఉన్నారు. ఇందులో 10 శాతం మంది వైద్యులు సమయానికి ఎప్పుడూ హాజరు కారు. కొందరు సమయానికి వచ్చి తమ వైద్య పరీక్షల్లో బిజీ బిజీగా ఉంటారు. కానీ కొందరు వైద్యులు మాత్రం.. నిర్దిష్ట సమయానికి రాకుండా.. గంటకు పైగా ఆలస్యంగా వచ్చి.. ఏదో ముభావంగా డ్యూటీ చేసి వెళ్లిపోతున్నట్లు రోగులు ఆరోపిస్తున్నారు. సాక్షి పరిశీలించినప్పుడు కూడా క్యాజువాలిటీ, ఆర్థోపెడిక్, చిన్నపిల్లల వార్డులో కొందరు డాక్టర్లు ఆలస్యంగా వచ్చారు. ఇంకొన్ని చోట్ల డాక్టర్లు హాజరు వేసుకుని.. తమ పరిధిలో ఉన్న మెడికోలకు విధులు అప్పగించేసి పలాయనం చిత్తగించారు.



క్యాజువాలిటీకి స్ట్రెచర్‌పై రోగిని తీసుకెళ్తున్న బంధువులు

మందులకు ఓ సారి.. పరీక్షలకు మరోసారి..



నాకు కిడ్నీ సమస్య ఉంది. వైద్యులు సూచించిన ప్రకారం రక్త పరీక్షల కోసం శుక్రవారం ఆస్పత్రికి వచ్చాను. ఆ రోజు రక్త పరీక్షలు చేయలేదు. సోమవారం రమ్మన్నారు. నాది మాడుగుల. ఒకే రోజు అన్ని పరీక్షలు జరిగితే బాగుణ్ను. మందులకు ఒకసారి, పరీక్షలకు ఒక సారి, వైద్యులను చూపించడానికి మరో సారి రావాలంటే ఇబ్బందిగా ఉంది. అసలే కిడ్నీ సమస్యతో చాలా అవస్థ పడుతున్నా. విశ్రాంతి కంటే ఆస్పత్రి చుట్టే ఎక్కువ సార్లు తిరుగుతున్నా..

– అప్పారావు, మాడుగుల

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమం తీవ్రతరం

- 22న సీఎండీ ఆఫీస్ ముట్టడి
- సెప్టెంబరులో రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు
- స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కమిటీ నేతలు


మాట్లాడుతున్న నరసింగరావు, ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ తదితరులు

సీతంపేట: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేసే ప్రసక్తిలేదని చెప్పిన కేంద్రం.. నెలరోజులుగా అందుకు విరుద్ధమైన చర్యలకు పూనుకుందని దీనిని ఎదుర్కొనేందుకు ఉద్యమాన్ని తీవ్రతరం చేయనున్నట్లు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ తెలిపింది. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం మీడియాతో కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఎలాగైనా నాశనం చేయాలనే దుర్బుద్ధితో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. దీనిని ఎదుర్కోవడానికి పోరాటమే తప్ప మరో మార్గం లేదన్నారు. దీనిలో భాగంగా ఈనెల 22న ఉదయం 8 గంటలకు స్టీల్‌ప్లాంట్ సీఎండీ ఆఫీస్‌ను ముట్టడిస్తామని తెలిపారు. కమిటీ చైర్మన్ సిహెచ్.నరసింగరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం సెప్టెంబరులో రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్లాంట్ సామర్థ్యం పెరుగుతుందన్న ఆశలు లేవనీ, ఉద్యోగుల హక్కులు తొలగిస్తున్నారనీ, కాంట్రాక్టు కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్, సభ్యుడు వరశాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రం ముడిసరుకు మీద ఆంక్షలు విధించి ప్లాంట్ ప్రైవేటీకరణ దిశగా నిర్వీర్యం చేస్తోందని, కార్మికులనూ, ఉద్యోగులను అవస్థల పాలు చేస్తోందన్నారు. సమావేశంలో కమిటీ ప్రతినిధులు నీరుకొండ రామచంద్రరావు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

25 వేల చ.అ. జెండాను ప్రదర్శించిన స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్


మువ్వన్నెల జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు


వైఎస్సార్ సెంట్రల్ పార్క్ చుట్టూ త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

డాబాగార్డెన్స్: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వైఎస్సార్ సెంట్రల్ పార్కు చుట్టూ సర్వీస్ రోడ్డులో బుధవారం 25 వేల చదరపు అడుగుల త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించారు. స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ 'ఝండా ఊంచా రహే హమారా' పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడారు. ఏటా ఆగస్టు 14న స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో దేశభక్తిని, జాతీయ సమైక్యతను పెంపొందించే దిశగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. స్టూడెంట్ యునైటెడ్ నెట్‌వర్క్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి మాట్లాడుతూ పదేళ్లుగా 'ఝండా ఊంచా రహే హమారా' కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కర్రి సీతారాం, ఉత్తరాంధ్ర విద్యార్థి సేన అధ్యక్షుడు ఎస్. రమణమూర్తి, ట్రాఫిక్ ఏసీపీ ఎస్.వాసుదేవ్, బీజేపీ నాయకుడు కొప్పుల రాంజీ, నెట్‌వర్క్ సభ్యులు గొల్ల ప్రదీప్‌రాజు, కర్రి నరేష్, మహ్మద్ ఇసాక్, రామాయణం సంతోష్ పాల్గొన్నారు.

స్వాతంత్ర వేడుకలకు విశాఖ సిద్ధం

మహారాణిపేట: నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్రం.. ఎందరో పోరాట యోధుల త్యాగఫలం. సుదీర్ఘకాలం సాగిన స్వాతంత్ర పోరాటంలో విశాఖ తనదైన ముద్ర వేసుకుంది. ఎన్నో కీలక ఘట్టాలకు వేదికైంది. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు నుంచి సామాన్యుల వరకు, మేధావుల నుంచి సాహితీవేత్తల వరకు, ఉపాధ్యాయుల నుంచి వైద్యుల వరకు స్వాతంత్రం కోసం ఉద్యమించా రు. స్వాతంత్రం సిద్ధించి 77 వసంతాలు పూర్తయి 78వ ఏట అడుగిడుతున్న వేళ వేడుకలకు నగరం సిద్ధమైంది. ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో జిల్లా స్థాయి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించి, ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. 450 మంది ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నారు. ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోడ్ వల్ల ఈ సారి ప్రభుత్వ శకటాల ప్రదర్శన, ఆస్తుల పంపిణీ ఉండదని అధికారులు తెలిపారు.


రిహార్సల్స్‌లో భాగంగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న జాయింట్ సీపీ ఫకీరప్ప

ఈపీడీసీఎల్ శాఖకు సంబంధించి 93 మంది ఉద్యోగులు, సిబ్బందికి అవార్డులు ప్రదానం చేయనున్నారు.

కట్టుదిట్టమైన భద్రత

విశాఖ సిటీ: స్వాతంత్ర వేడుకలకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జాయింట్ సీపీ కె.ఫకీరప్ప తెలిపారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో జరుగుతున్న ఈ వేడుకల ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. జెండా వందనం, ఇత ర ఏర్పాట్లపై ఆరా తీశారు. అనంతరం కవాతు పరిశీలన వాహనంలో వెళ్లి.. ఆర్మ్‌డ్ రిజర్వ్ బలగాలు, సివిల్ పోలీసులు, హోంగార్డ్స్, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల కవాతు రిహార్సల్స్‌ను పరిశీలించారు.

భక్తులకు నిత్యాన్నదానం.. అప్పన్న మహిమ


నిత్యాన్నదాన భవనంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థాన నిత్యాన్నదాన పథకం 36వ వార్షికోత్సవం బుధవారం సింహగిరిపై ఘనంగా నిర్వహించారు. అన్నప్రసాద భవనంలో సింహాద్రినాథుడి చిత్రపటం వద్ద దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి హారతులు సమర్పించారు. భక్తులకు నిత్యం అందించే ఆహార పదార్థాలతోపాటు ప్రత్యేకంగా తయారు చేసిన చక్కెరపొంగలి, బూరి, పులిహోర ప్రసాదాన్ని అందజేశారు. ఈవో దంపతులు భక్తులకు స్వయంగా వడ్డించారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, ఈఈ శ్రీనివాసరాజు, ఏఈవోలు ఆనంద్‌కుమార్, పాలూరి నరసింగరావు, సూపరింటెండెంట్లు సునీల్, పిల్లా శ్రీనివాసరావు, ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, సిబ్బంది కాశి, హరి, పీఆర్వో నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విరాళాల డిజిటల్ చెల్లింపులకు చర్యలు..

అప్పన్న మహిమ, దాతలు అందిస్తున్న విరాళాలు, సహకారంతో నిత్యాన్నదాన పథకం దినదినాభివృద్ధి చెందుతోందని ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు. సింహాచలానికి వచ్చే భక్తులందరికీ అన్నప్రసాదం అందేలా చేస్తున్నామన్నారు. అన్నప్రసాద భవనంలోని రెండు అంతస్తుల్లోనూ ట్రిప్పునకు సుమారు 600 మంది వరకు అన్నప్రసాదాన్ని అందించేలా ప్రణాళిక చేశామని, త్వరలోనే కార్యరూపం దాలుస్తుందన్నారు. అన్నప్రసాద భవనం వద్ద భక్తులు విరాళాలను డిజిటల్ రూపంలో ఫోన్‌పే, గూగుల్ పే, క్యూఆర్ కోడ్‌ల ద్వారా చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దాతలకు కూడా ప్రత్యేకంగా డోనార్ కార్డులు జారీ చేస్తున్నామన్నారు. మహారాజపోషకులు, రాజపోషకులకు స్వామివారి దర్శనాల్లో ప్రాధాన్యం కల్పిస్తున్నట్టు ఈవో చెప్పారు.

రెండు కేసుల్లో 8 మంది అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న క్రైం డీసీపీ వెంకటరత్నం

ఎంవీపీకాలనీ: ద్వారకా క్రైమ్ జోన్ పరిధిలో ఇటీవల జరిగిన రెండు కేసుల్లో 8 మందిని అరెస్ట్ చేసినట్లు నగర క్రైమ్ డీసీపీ వెంకటరత్నం వెల్లడించారు. ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. ఈ నెల 12న ఎంవీపీ స్టేషన్ పరిధి వెంకోజీపాలెంలో జరిగిన దారి దోపిడీకి సంబంధించి నక్కవానిపాలేనికి చెందిన పిల్లా జయదీప్‌తోపాటు మరో ముగ్గురు మైనర్లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరి నుంచి ఒక సెల్‌ఫోన్, రూ.1,000 నగదు, చోరీ చేసిన ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో జోడుగుళ్లపాలెం వద్ద ఈ నెల 13న జరిగిన దోపిడీలో అదే ప్రాంతానికి చెందిన గద్దిపిల్లి సింహాద్రి, తాడి శేఖర్, గాలి సూర్యప్రకాష్, మామిడి ప్రశాంత్‌లను అరెస్ట్ చేసి, ఒక సెల్‌ఫోన్, రూ.500 నగదు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దోపిడీలకు ఆయా యువకులు గంజాయి సేవించడం, చెడు అలవాట్లే ప్రధాన కారణంగా తేలిందన్నారు. గంజాయికి బానిసలైన యువత నేరాలకు పాల్పడుతున్న ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. నగర యువత చెడు అలవాట్లుకు, గంజాయికి దూరంగా ఉండాలని డీసీపీ వెంకటరత్నం కోరారు. నేరాలకు పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని, రౌడీషీట్లు ఓపెన్ చేసేందుకు వెనుకాడబోమన్నారు. కార్యక్రమంలో క్రైమ్ ఏడీసీపీ మహేష్, జోన్–1 ఏసీపీ వెంకటరావు, క్రైమ్ సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇలాగేనా పారిశుద్ధ్య నిర్వహణ

- శానిటరీ కార్యదర్శులు పనితీరు మెరుగుపరచుకోవాలి
- జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్


మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

డాబాగార్డెన్స్: నగరంలో పారిశుధ్యం నిర్వహణ సరిగ్గా చేపట్టడం లేదని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనా థియేటర్‌లో జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, జోన్ల కమిషనర్లు, ఏఎంఓహెచ్‌లు, వార్డు సచివాలయ శానిటరీ కార్యదర్శులతో స్వచ్ఛభారత్ మిషన్ 2.0 కెపాసిటీ బిల్డింగ్, స్వచ్ఛ సర్వేక్షణ్–2024 కార్యక్రమాల అమలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛభారత్ 2.0లో భాగంగా స్వచ్ఛ సర్వేక్షణ్–2024కు సంసిద్ధం కావాలని.. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మూడు వారాలుగా నగరంలో పరిశీలించానని పారిశుధ్య పనులు సరిగ్గా జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. శానిటరీ కార్యదర్శులు పనితీరు మార్చుకొని ప్రణాళికా ప్రకారం విధులు నిర్వహించాలని హెచ్చరించారు. పారిశుధ్య నిర్వహణకు నగరంలో ఉన్న యంత్రాంగం రాష్ట్రంలో మరెక్కడా లేదని... అయినా పారిశుధ్యాన్ని మెరుగుపరచడంలో జీవీఎంసీ విఫలమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఇంటి నుంచి చెత్త విభజన, సేకరణ, తొలగింపునకు ప్రత్యేక ప్రణాళికను శానిటరీ కార్యదర్శులు, అధికారులు రూపొందించుకోవడం వల్ల నివాసిత ప్రాంతాల్లో డస్ట్‌బిన్ ఫ్రీ చేయవచ్చన్నారు. మురికివాడల్లో రద్దీగా ఉన్న కమర్షియల్ ప్రాంతాలు, ప్రధాన కాలువల్లోని వ్యర్థాలు లేకుండా నిత్యం పరిశుభ్రతపై పరిశీలన జరపాలన్నారు. వార్డు శానిటరీ కార్యదర్శి నుంచి అదనపు కమిషనర్ వరకు నిత్యం వార్డుల్లో పర్యటిస్తూ పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు.

త్వరితగతిన 'ఐఐఎంవీ' తాగునీటి పనులు

- అధికారులకు కలెక్టర్ ఆదేశం


ఐఐఎంవీలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

తగరపువలస : గంభీరంలోని ఐఐఎం విశాఖపట్నం తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన భూగర్భ పైప్‌లైన్ల పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులను పూర్తి చేసి తాగునీరు అందించాలన్నారు. గంభీరంలోని ఐఐఎం విశాఖపట్నం కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్, ఐఐఎం అధికారులతో సమీక్ష నిర్వహించారు. గోస్తనీ నదిలో బోని నుంచి 12.5 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ ఏర్పాటు చేసి ఐఐఎంకు తాగునీటి సరఫరా చేయాల్సి ఉందని, ఇప్పటి వరకు 6 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. నేషనల్ హైవే, ఆర్ అండ్ బీ విభాగం నుంచి క్లియరెన్స్ వచ్చాక మిగిలిన పనులు పూర్తి చేస్తామని కలెక్టర్‌కు చెప్పారు. ఈఈ ఆర్.వి.ఎస్.చౌదరి, ఐఐఎం అధికారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పూర్తికి ప్రణాళిక


సమీక్షిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, గృహ నిర్మాణ సంస్థ జిల్లా పీడీ అఖిల, అధికారులు

మహారాణిపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆకాంక్షల మేరకు జిల్లాలో నిర్మిస్తున్న గృహాల ప్రగతి భారీగా పెరగాలని గృహ నిర్మాణ శాఖ అధికారులకు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ లేఅవుట్లలో చేపట్టిన గృహ నిర్మాణాలు, వాటి పురోగతిపై బుధవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో గృహ నిర్మాణ సంస్థ జిల్లా పీడీ డి.అఖిల, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. లేఅవుట్ల తాజా పరిస్థితిని ఆయా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 100 రోజుల్లో 71 వేల గృహాల స్టేజ్ అప్‌డేషన్ జరగాలని, ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. గృహ నిర్మాణాలకు అవసరమైన ఇసుక, సిమెంట్, నీరు, సిబ్బంది కొరత లేదని, ఇప్పటివరకు చేపట్టిన పనులకు చెల్లింపులు కూడా జరిగినట్లు వివరించారు. ఆ దిశగా అధికారులంతా తీవ్ర కృషి చేయాలని ఆదేశించినప్పటికీ పనుల్లో పురోగతి లేదని, ఇకపై ప్రగతి సాధించకుంటే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఇచ్చిన లక్ష్యానికి ఇంకా 14 వారాల సమయం ఉన్నందున ప్రతి వారం 5 వేల గృహాల స్టేజ్ అప్‌డేషన్ కావాల్సిందేనని కలెక్టర్ తేల్చిచెప్పారు. గుత్తేదారులతో మాట్లాడి త్వరితగతిన పనులు చేయించాల్సిన బాధ్యత గహ నిర్మాణ సంస్థ అధికారులదేనన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా 100 రోజుల ప్రణాళికతో అందరూ చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. గృహ నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని, అధికారులు, సిబ్బంది, వర్క్ ఇన్‌స్పెక్టర్లు అధిక ప్రాధాన్యమిస్తూ అంకితభావంతో పనిచేయాలని కోరారు. గృహ నిర్మాణ శాఖ ఈఈ సత్యనారాయణ, డీఈలు రామకృష్ణ, సూర్యప్రకాశ్, సీతారాం, ఏఈ సూర్యప్రకాశరావు, ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్ల జారీకి తూట్లు

- రిజిస్ట్రేషన్లు నిలుపుదల
- జారీ అంశంపై విచారణ
- జాయింట్ కలెక్టర్ ప్రకటన

మహారాణిపేట : డి–పట్టా భూములకు హక్కులు కల్పించేందుకు జగనన్న ప్రవేశ పెట్టిన ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్ల జారీకి తూట్లు పొడుస్తున్నారు. పేదల కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ పథకాన్ని కూటమి ప్రభుత్వం నీరు కారుస్తోంది. ఈ పథకం కింద భూహక్కులు కల్పించి, రిజిస్ట్రేషన్ చేస్తున్న ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్లను తాజాగా నిలుపుదల చేస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో జిల్లాలో ఎక్కడికక్కడ ఈ ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్ల జారీ ఆపేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీవో నెంబర్ 596ను జారీ చేసి డి–పట్టా భూములు తీసుకున్న వారికి అన్ని హక్కులు కల్పించాలని నిర్ణయించింది. దీని వల్ల రెవెన్యూ యంత్రాంగం హక్కులతోపాటు రిజిస్ట్రేషన్ చేయాలని నిర్ణయించారు. మొత్తం 600 ఎకరాల భూమి డి–పట్టాల కింద ఉన్నట్లు గుర్తించారు. వీరికి ఫ్రీ హోల్డ్ కింద ప్రభుత్వ ఆదేశాల ప్రకారం హక్కులు కల్పించడం, రిజిస్ట్రేషన్ చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఆనందపురం మండలంలో 414 ఎకరాలు, పద్మనాభంలో 142 ఎకరాలు, పెందుర్తిలో 30 ఎకరాలు, భీమిలిలో 19 ఎకరాలకు ఇప్పటి వరకు సర్టిఫికెట్లు ఇచ్చారు. వీటిలో 100 ఎకరాలు పైబడి భూమికి రిజిస్ట్రేషన్లు కూడా జరిగాయి. అయితే ఇప్పుడు ఆరోపణల నెపంతో వీటిపై విచారణ చేయాలని నిర్ణయించారు. ముందుగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలుపుదల చేసి విచారణ చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. మొత్తం ఈ వ్యవహారం మీద విచారణ జరుగుతుందన్నారు.

సంస్థకు చెడ్డపేరు తీసుకొస్తే ఉపేక్షించేది లేదు

- వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: లేఅవుట్ దరఖాస్తుదారులు ఆఫీస్ చుట్టూ తిరగకుండా.. వారికి అనవసర కాలయాపన చేయకుండా ఫైల్స్‌ను పరిష్కరించాలని వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో ప్రణాళికా విభాగంపై బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన ప్రణాళిక విభాగపు ఈ–ఆఫీస్ వ్యక్తిగత లాగిన్‌లో పెండింగ్ ఫైల్స్ వివరాలపై ఆరా తీశారు. అందుకుగల కారణాలపై సంబంధిత అసిస్టెంట్ల నుంచి వివరణ అడిగారు. లేఅవుట్ దరఖాస్తుల పరిష్కార విషయంలో జాప్యం జరగకూడదని చెప్పారు. కోర్టు కేసు సంబంధిత ఫైళ్లలో కౌంటర్ అఫిడవిట్లను సకాలంలో దాఖలు చేయాలని, అలసత్వం వహించవద్దని సూచించారు. పాత దస్త్రాలు అన్నింటినీ స్కానింగ్ చేసి రికార్డు రూమ్‌లో భద్రపరిచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. సంస్థకు చెడ్డపేరు తీసుకొచ్చే విధంగా వ్యవహరించే ఉద్యోగులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకునే విషయంలో వెనకాడనని తేల్చి చెప్పారు. పని తీరు మార్చుకుని ప్రతీ ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. సమావేశంలో కార్యదర్శి కీర్తి, చీఫ్ అర్బన్ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, వీకేపీసీపీఐఆర్–యూడీఏ జాయింట్ డైరెక్టర్ శిల్ప, ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

పోర్టుకు ఇచ్చిన భూములు వెనక్కి తీసుకోండి


కమిషనర్ విశ్వనాథన్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రేటర్ విశాఖ సిటిజెన్స్ ఫోరం ప్రతినిధులు

విశాఖ సిటీ: శాటిలైట్ పోర్టు, ఫిషింగ్ హార్బర్ కోసం గతంలో విశాఖ పోర్టుకు కేటాయించి ఇచ్చిన భూములను వెనక్కి తీసుకోవాలని గ్రేటర్ విశాఖపట్నం సిటిజెన్స్ ఫోరం ప్రతినిధులు వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. విశాఖ పోర్టులో రద్దీని తగ్గించడానికి భీమిలి మండలం మూలకుద్దులో శాటిలైట్ పోర్టు, ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి సుమారు 16 ఏళ్ల కిందట విశాఖ పోర్టుకు 288.12 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు చెప్పారు. అక్కడ పోర్టు నిర్మాణ సాధ్యాసాధ్యాలు, ప్రయోజనాలపై ఆకామ్ అనే కన్సల్టెన్సీ సంస్థ నివేదిక అందించిందని తెలిపారు. దాని ప్రకారం శాటిలైట్ పోర్టుతోపాటు ఫిషింగ్ హార్బర్ కూడా ఆచరణీయమైనది కాదని తేలినట్లు చెప్పారు. దీంతో ప్రస్తుతం ఆ స్థలాన్ని వాణిజ్య అవసరాలకు ఉపయోగించాలని విశాఖ పోర్టు ఆలోచిస్తోందని పేర్కొన్నారు. ఆ స్థలంలో పర్యాటక ప్రాజెక్టు ఏర్పాటుకు ఆసక్తి వ్యక్తీకరణకు దరఖాస్తులు ఆహ్వానిస్తోందని, వాస్తవానికి భూమి కేటాయింపు జీవో ప్రకారం ఈ స్థలాన్ని ఇతర అవసరాలకు వినియోగించకూడదని స్పష్టంగా ఉన్నట్లు తెలిపారు. దాని ప్రకారం ఆ భూములను పర్యావరణహితంగానే ఉంచాలని, శాటిలైట్ పోర్టు నిర్మాణానికి అవకాశం లేని ఆ భూముల కేటాయింపులు రద్దు చేసి వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

77 కి.మీ పరుగు.. సాహసోపేతమైన క్రతువు


రన్, సైకిల్ యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న డీసీపీ తుహిన్ సిన్హా

బీచ్‌రోడ్డు: స్వాతంత్ర దినోత్సవ స్ఫూర్తిని చాటి చెప్పే లక్ష్యంతో 12 గంటల్లో 77 కిలోమీటర్ల రన్ నిర్వహించడం అభినందనీయమని డీసీపీ తుహిన్ సిన్హా అన్నారు. విశాఖపట్నం ట్రైల్ రన్నింగ్ అసోసియేషన్ సభ్యులు బుధవారం సాయంత్రం 'రన్ ఎక్రాస్ వైజాగ్'పేరుతో రెండో ఎడిషన్ పరుగు, సైకిల్ యాత్రకు శ్రీకారం చుట్టారు. ఆర్.కె. బీచ్ కాళీమాత ఆలయం వద్ద డీసీపీ తుహిన్ సిన్హా జెండా ఊపి రన్, సైకిల్ యాత్ర ప్రారంభించారు. 77 కిలోమీటర్ల పరుగు సాహసోపేతమైన క్రతువని, జాతీయోద్యమ స్ఫూర్తిని అందించేందుకు సభ్యులు తమ శక్తిని ధారపోయడం ప్రశంసనీయమన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు యోగేశ్వరరావు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 77 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 77 కిలోమీటర్ల రన్‌తో పాటు సైకిల్ యాత్ర చేపట్టామన్నారు. ఆర్కే బీచ్, తెన్నేటి పార్క్, హనుమంతవాక, అడివివరం, ఐఎన్ఎస్ కళింగ, భీమిలి వరకు వెళ్లి.. తిరిగి గురువారం ఉదయం 6 గంటలకు 'విక్టరీ ఎట్ సీ' వద్దకు చేరుకోగానే పరుగు ముగుస్తుందన్నారు. పరుగులో 50 మంది, సైకిల్ యాత్రలో 25 మంది భాగస్వామయ్యారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కృష్ణ చైతన్య, సంయుక్త కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

తిరుగుపయనమైన దాసుడు


సింహగిరి నుంచి పయనమైన లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్

సింహాచలం: ఒడిశాకి చెందిన లక్ష్మీనాయక్‌దాస్ బుధవారం సింహగిరిపై నుంచి తిరుగుపయనమయ్యారు. ఒడిశాలోని పట్టుపురానికి చెందిన దాసుల కుటుంబం తరతరాలుగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి విశేష సేవలందిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుత తరానికి చెందిన లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్ ఈ ఏడాది మే నెలలో సింహగిరికి వచ్చారు. సింహగిరిపై ఉన్న దాసుల ఆశ్రమంలో సుమారు మూడు నెలలపాటు ఉండి స్వామికి విశేష సేవలందించారు. నిత్యకల్యాణం, గరుడసేవ, ఉంజల్‌సేవ, కోలా సేవ, లక్ష తులసి పూజ తదితర సేవలను జరిపించారు. బుధవారం మధ్యాహ్నం సింహగిరి నుంచి తన పరివారంతో తిరుగుపయనమయ్యారు.

శాంతి భద్రతల పరిరక్షణలో రాజీలేదు


హోంమంత్రికి సంపత్ వినాయక చిత్రపటం అందజేస్తున్న దేవదాయశాఖ ఏసీ శిరీష

సీతమ్మధార: రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో రాజీపడే ప్రసక్తే లేదని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆమె బుధవారం ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ ఆలయాన్ని కుటుంబ సభ్యులతో సందర్శించి.. వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆమెకు వేద ఆశీర్వచనం అందజేశారు. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈవో శిరీష సంపత్ వినాయకుడి చిత్రపటం, ప్రసాదం అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. దేవస్థానం అర్చకులు, సిబ్బంది జి.గోవిందరెడ్డి పాల్గొన్నారు.

గరీబ్‌రథ్‌కు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల డిమాండ్ మేరకు, వెయిటింగ్ లిస్ట్ జాబితాను తగ్గించే దిశగా గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు అయా తేదీల్లో అదనపు కోచ్‌లను జత చేస్తున్నారు. సికింద్రాబాద్–విశాఖపట్నం(12740) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 14 నుంచి 19వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో విశాఖపట్నం–సికింద్రాబాద్ (12739) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు రెండు థర్డ్ ఏసీ ఎకానమి కోచ్‌లను అదనంగా జతచేస్తున్నారు. మధురై–ముజఫర్‌పూర్ మధ్య వన్ వే స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ డీసీఎం సందీప్ తెలిపారు. మధురై–ముజఫర్‌పూర్ (06114) వన్‌వే స్పెషల్ ఈ నెల 18న(ఆదివారం) మధురైలో రాత్రి 7.05 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 9.40 గంటలకు దువ్వాడకు బుధవారం తెల్లవారు 2.45 గంటలకు ముజఫర్‌పూర్ చేరుకుంటుంది.

కొనసాగిన జూడాల ఆందోళన


కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట ప్రదర్శన చేస్తున్న వైద్య విద్యార్థులు

మహారాణిపేట: కేజీహెచ్‌లో జూనియర్ వైద్యులు బుధవారం కూడా ఆందోళన చేపట్టారు. పశ్చిమ బెంగాల్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీపై అత్యాచారం చేసి.. హత్య చేసిన విషాద ఘటనను నిరసిస్తూ.. వారంతా విధులు బహిష్కరించారు. దీంతో ఓపీలకు అంతరాయం కలిగింది. వైద్యం కోసం ఎంతో దూరం నుంచి వచ్చిన రోగులు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఓపీలు చూశారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు అరుదైన అవకాశం

- పంద్రాగస్టు వేడుకలకు ఢిల్లీ పయనం


రావిపల్లి రమణమ్మ

సబ్బవరం: దేశ రాజధానిలో జరిగే స్వాతంత్ర దినోత్సవంలో పాల్గొనేందుకు మల్లునాయుడపాలెం అంగన్‌వాడీ కార్యకర్త రావిపల్లి రమణమ్మ ఢిల్లీ వెళ్లారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ తరపున ఉత్తమ జాతీయ స్థాయి అంగన్‌వాడీ కార్యకర్తగా ఆమె ఎంపికయ్యారని ఐసీడీఎస్ సీడీపీవో లలిత్ కుమారి తెలిపారు. గురువారం జరిగే వేడుకల్లో ఆమె పాల్గొంటారని సీడీపీవో వెల్లడించారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలోని స్కిల్ హబ్‌లో యువతీ యువకులకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సుకు పదో తరగతి ఆపై విద్యార్హతలు కలిగిన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. హ్యాండ్ ఎంబ్రాయిడరీ(మగ్గం వర్క్)లో చేరడానికి కనీసం 8వ తరగతి విద్యార్హత కలిగిన మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కోర్సుల్లో చేరడానికి 45 ఏళ్ల వయోపరిమితి నిబంధన ఉందన్నారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సు 6 నెలలు, హ్యాండ్ ఎంబ్రాయిడరీ(మగ్గం వర్క్) కోర్సులో 3 నెలలు శిక్షణ ఉంటుందని చెప్పారు. ఈ నెల 20 నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. వివరాలకు 72870 69457 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

12 వాహనాలపై కేసుల నమోదు

గోపాలపట్నం: బ్లాక్ ఫిల్మ్ ఉన్న వాహనాలపై రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 5 వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఇతర కారణాలతో 3 వాహనాలపై కేసు నమోదు చేసినట్లు ఉపరవాణా కమిషర్ రాజారత్నం తెలిపారు. గాజువాక బోయపాలెం, పెందుర్తి, ఎస్ఎస్‌టీఎల్ ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న 4 బస్సులపై కేసులు నమోదు చేశారు.

20న ప్రాంగణ ఎంపికలు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)లో ఆటో లివ్ కంపెనీ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ డిప్లొమా విద్యార్థులకు ఈ నెల 20న క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆటో మొబైల్ రంగానికి చెందిన వివిధ పరికరాలు, వస్తువుల తయారీ రంగంలో పేరుగాంచిన ఈ కంపెనీ డిప్లొమా ట్రైనీల ఎంపిక ప్రక్రియ ఆరోజు 9.30 గంటలకు నిర్వహిస్తామన్నారు. పాలిటెక్నిక్ డిప్లొమా మెకానికల్, ఆటో మొబైల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగాలకు చెందిన 2022, 2023, 2024 పాస్‌అవుట్ విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ఎంపికైన వారు ఆ సంస్థకు చెందిన కాంచీపురం, చెన్నై క్యాంపస్‌లో పనిచేయాల్సి ఉంటుంది.

సింహగిరిపై వ్యాపారాలకు వేలం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పరిధిలో పలు వ్యాపారాలు చేసుకునేందుకు, లీజు హక్కులు ఇచ్చేందుకు బుధవారం బహిరంగ వేలం, సీల్డ్ టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. సింహగిరిపై క్లాక్‌రూమ్ నిర్వహణకు సంవత్సరం కాలపరిమితికిగాను 30,09,999కి లీజుదారుడు హెచ్చుటెండర్ దాఖలు చేశాడు. అలాగే భక్తుల సెల్‌ఫోన్లు, కెమెరాలు భద్రపరిచేందుకు సంవత్సరం కాలపరిమితికి రూ. 69.5 లక్షలకు, కేశఖండనశాల వద్ద టీకాఫీ మిషన్లు పెట్టుకునేందుకు, స్నాక్స్ అందించేందుకు నెలకు రూ.22,500, జోడు భద్రాల వద్ద టీ, కాఫీ మిషన్లు పెట్టుకునేందుకు, స్నాక్స్ అందించేందుకు నెలకు రూ.35 వేలు, క్షేత్రదర్శిని ప్రదేశంలో టీ, కాఫీ మిషన్లు పెట్టుకునేందుకు, స్నాక్స్ అందించేందుకు నెలకు రూ.48 వేలకు, సింహగిరి బస్టాండ్‌లో టీ, కాఫీ మిషన్లు పెట్టుకునేందుకు, స్నాక్స్ అందించేందుకు నెలకు రూ. 28 వేల హెచ్చు పాటకి వెళ్లింది.

వివాహితను బ్లాక్‌మెయిల్ చేస్తున్న వ్యక్తి అరెస్ట్

విశాఖ సిటీ: ఇన్‌స్టా గ్రామ్‌లో స్నేహం పేరుతో పరిచయం చేసుకొని.. మాయ మాటలు చెప్పి దగ్గరై.. రహస్యంగా ఫొటోలు, వీడియోలు తీసి వివాహితను బ్లాక్‌మెయిల్ చేస్తున్న వ్యక్తిని సైబర్ క్రైమ్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. నగరానికి చెందిన వివాహితకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒడిశాకు చెందిన సభ్యాస్మిత్ రౌత్ అనే వ్యక్తి నుంచి మెసేజ్ వచ్చింది. ఫ్రెండ్‌షిప్ పేరుతో ఆమెతో కొద్ది రోజులు చాట్ చేశాడు. ఫోన్ నెంబర్ సేకరించి మాయమాటలు చెప్పి ఛాటింగ్, వాయిస్, వీడియో కాల్స్ చేస్తూ దగ్గరయ్యాడు. ఈ క్రమంలో లైంగిక సంబంధం పెట్టుకొని ఆ సమయంలో రహస్యంగా వీడియోలు తీశాడు. కొద్ది రోజులకు అతడి ప్రవర్తన నచ్చక ఆమె దూరం పెట్టింది. దీంతో సదరు వ్యక్తి వీడియోలు, ఫొటోలను కుటుంబ సభ్యులకు పంపించి బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. దీంతో వివాహిత సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ భవానీప్రసాద్.. సాంకేతికత సహాయంతో సభ్యాస్మిత్ రౌత్‌ను గుర్తించి అరెస్టు చేశారు.

షార్ట్ సర్క్యూట్ వల్లే డైనో పార్క్‌లో ప్రమాదం

బీచ్‌రోడ్డు: సాగరతీరంలోని డైనో పార్క్‌లో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఎటువంటి కుట్ర లేదని, షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుందని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. అగ్నిప్రమాదంపై దర్యాప్తు ప్రారంభించిన మూడో పట్టణ పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. బుధవారం డైనో పార్క్ ప్రాంతంలోని అన్ని వైపులా సీసీ ఫుటేజీను పోలీసులు పరిశీలించారు. ఎటువంటి అనుమానాస్పదమైన కదలికలు కనిపించలేదు. కేవలం విద్యుత్ ఘాతం వల్లే అగ్నిప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. డైనో పార్క్‌పై ఎటువంటి బీమా కూడా లేదని, ఇది కావాలని చేసే అవకాశం లేదని తెలుస్తోంది.